# మంచి కళ్ళజోళ్ళు కొనుక్కోండి

ముప్పై, నలభై యేళ్ళ క్రితంనాటి మాట. అప్పటికి గోదావరికి ఆలమూరు దగ్గర బ్రిడ్జి కట్టలేదు. కోనసీమకు ప్రయాణం అంటే కొండ త్రవ్వి ఎలక్షను పట్టినట్లు వుండే రోజులవి. యేరు దాటడం – యేరు దాటిన తరువాత జట్కా బళ్ళకోసం కాసుక్కూర్చోవడం–అంతా పెద్ద యజ్ఞం అనిపించేది అందరికీ ప్రయాణం అంటేను.

అద్దరిని అందమైన గ్రామం. ఆ గ్రామానికి పెద్దరికం వహించేది అదినుంచీ సుందర్రామయ్య వంశీకులే. అందుకే ఎన్నికలు వచ్చాకకూడా, సుందర్రామయ్యే ఆ గ్రామానికి ప్రెసిడెంటు అయ్యాడు, అప్పుడప్పుడు ఎలక్షనులు వచ్చేవి, పోయేవి, ఆ వూరుకి ప్రెసిడెంటు మాత్రం సుందర్రామయ్యే – సూర్యుడు ఎప్పుడూ తూర్పునే వుదయించినట్టు.

చిత్రం ఏమిటంటే గత మూడు ఎన్నికలనుంచీ కనకరాజు సుందర్రామయ్యకి పోటీగా నిలబడుతూనే వున్నాడు. ఓడిపోతూనే వున్నాడు. కాని ఓ మంచిపేరు జనంలో తెచ్చుకున్నాడు కనకరాజు. ఏమిటీ అంటే చాలా చక్కగా మాట్లాడతాడు కనకరాజు అని.

అది ఎన్నికల సీజను. ఏమయినా ఈసారి గట్టి ప్రయత్నంచేసి నెగ్గాలనుకున్నాడు కనకరాజు. సుందర్రామయ్య కనకరాజును ఇదివరలోనూ ఖాతరు చెయ్యలేదు. యీసారీ చెయ్యలేదు. ఎన్నికల ప్రచారం మాత్రం ముమ్మరంగా సాగుతోంది –

కనకరాజు రామాలయం ముందు మీటింగు ఏర్పాటు చేసాడు. కనకరాజు మీటింగు అంటే – చక్కని వక్త అని పేరుండడంతో జనం బాగానే వచ్చారు. మైకుముందు నిలబడ్డాడు కనకరాజు –

'మహాజనులారా!' అన్నాడు.

అంతే!

వీధి చివరినుంచి "బోలో స్వతంత్ర భారత్‌కీ! సుందర్రామయ్య గారికే మన వోటు" అన్న నినాదాలు వినపడ్డాయి.

ఓ వంద రెండెడ్ల బళ్ళు!

రెండువందల సైకిళ్ళు.

బ్యాండు మేళం.

ఢంకా నౌబత్ ఖానా.

వెనక బారులు తీరిన జనం.

డోలక్ డాన్స్ మేళం

మూడు లారీలు - లారీలమీద వేషాలూ.

ఆ వెనక చిన్న కారులో సుందర్రామయ్య - ఈ ఊరేగింపు సుందర్రామయ్య, తన బలం కనకరాజుకీ, వూరు జనానికీ వ్యక్తం చేయడానికి ఏర్పాటు చేసాడా అన్నట్టువుంది. ఊరు జనాన్ని ఆ వూరేగింపుతో తనవైపు తిప్పేసుకొనేటంత దర్పంగా వుంది సుందర్రామయ్య ఏర్పాటు చేసిన ఆ ఊరేగింపు.

దాంతో కనకరాజు మీటింగుకి వచ్చిన జనం అంతా ఆ ఊరేగింపు చూడ్డానికి వెళ్ళిపోయారు. కనకరాజూ, మైకూ మాత్రం మిగిలిపోయారు.

ఊరేగింపు వెళ్లిపోయింది.

దుమ్ము రేగింది దట్టంగా.

"ఊరేగింపు వెళ్లిపోయిందీ. ఇంక జనం మీటింగుకి వచ్చేస్తారు" అనుకున్నాడు కనకరాజు.

కొంతమంది వచ్చారు గాని, చాలామంది గుంపుగాచేరి ఊరేగింపు వెళ్ళిన రోడ్డుమీదే వుండిపోయారు.

ఓ పంది లారీకింద పడిపోయింది. దాని చుట్టూ జనంచేరారు.

"అయ్యో, వరహావతారం నిష్కారణంగా హత్యచేయబడిందే పాపం! ఆ లారీవాడి కళ్ళుపోతాయ్" అన్నాడు పూజారిగారు.

"అవతార మరణం ఏమిటండీ. యీ అవతారం చాలించి మరో అవతారం ఎత్తుతుంది." అన్నాడు ఇంగ్లీషు మాస్టారు.

"అవతార పురుషులంతే అలా అవతారాలు మారుస్తూనేవుంటారు" అన్నాడు ఓ కాలేజీ స్టూడెంటు.

ఇలా జనం మాట్లాడుకుంటూ వుండగా, ఆ పంది లేచి అక్కడి నుంచి పారిపోయింది.

"చూశారా పూజారిగారు - అసలు అవతారానికి చావూ ఏమిటండీ - మన అజ్ఞానంగానీ" అన్నాడు ఓ సాధువు.

చివరికి జనం అంతా కనకరాజు మీటింగు దగ్గరికి చేరారు.

కనకరాజు ఉపన్యాసం ప్రారంభించాడు.

జనం చాలా నిశ్శబ్దంగా వున్నారు.

"మహాజనులారా, అంత బ్రహ్మాండమైన ఊరేగింపు మీ కళ్ళముందునుంచే ఉప్పెనలా వెళ్ళిపోయింది. దాన్ని మీరు చూసిన తర్వాత, నేను ఏం మాట్లాడినా, మిమ్మల్ని ఎంత ఒప్పించినా, మీరు నాకు ఓటు వేస్తారనే నమ్మకం లేదు. అయినా సుందర్రామయ్యకి ప్రత్యర్థిని గాబట్టి నా ధర్మం నేను నిర్వర్తించాలి - మాట్లాడుతాను."

"మాట్లాడటం అంటే మన గ్రామం గురించీకాదు. సుందర్రామయ్య దుర్మార్గాల గురించీకాదు. మీ అమాయకత్వం గురించీకాదు. ఓ కథ చెబుతాను వినండి. ఈ రోజు అర్థంకాకపోయినా మళ్లీ ఎన్నికల నాటికయినా అర్థంచేసుకోండి –"

ఒక యిరవైయేళ్ళ క్రితం మన ప్రాంతానికి బస్సులు లేవు. యేరుదాటి ఊళ్లోకి వెళ్ళాలంటే మస్తాన్ గుర్రబ్బండే శరణ్యం. మస్తాన్ గుర్రబ్బండి దొరకడం అంటే పుష్పక విమానం దొరికినట్టే భావించేవారు జనం ఆ రోజుల్లో.

మస్తాన్ ఆ రోజుల్లో చూడముచ్చటగా వుండేవాడు. గ్లాస్కో లాల్చీ, గళ్ళలుంగీ, మెళ్లో గళ్ళ రుమాలు, చెవిలో మొగలిసెంటులో ముంచిన దూదిపింజ, చేతిలో కుచ్చుల కొరడా – మనిషి రంగుదేరి గుమ్మటంలా వుండేవాడు.

అతని గుర్రంకూడా – లాగేది బండే అయినా రేసుగుర్రంలా అగుపించేది. కారణం ఏమిటంటే మస్తాన్ రోజుకి దాదాపు పదిహేను ఇరవై రూపాయల దాకా సంపాదించేవాడు బండికూలిమీద. తన తిండికీ తాగుడికీ బట్టకీ పదిరూపాయలు రోజూ పోయినా; అయిదురూపాయలు గుర్రం దాణాకీ, నాఁవుపచ్చగడ్డికీ ఖర్చు పెట్టేవాడు. అందుచేతనే గుర్రం – మస్తానూ కూడా చూసేవారికి కన్నులపండుగగా అగుపించేవారు.

కాని కాలం మారింది.

బస్సులొచ్చాయ్.

జట్కాబళ్ళు నడిచే రోడ్లమీద బస్సులు నడవడం ప్రారంభమయింది.

అంతే! మస్తాన్ జట్కాబండికి గిరాకీ పడిపోయింది.

బస్సులమీద లాభాలు వస్తున్నాయని తెలిసి బస్సుల సంఖ్య పెరిగింది.

దాంతో మస్తాన్ జట్కాబండికి బాగా గీరాకీ తగ్గింది.

మస్తాన్ చిక్కిపోతున్నాడు.

సెంటువాసన వుండేదిగాని యిదివరకటి నిగారింపు మస్తాన్ ముఖంలో లేదు.

మస్తాన్‌తోబాటు గుర్రమూ చిక్కిపోయింది.

గుర్రానికి దాణా సరిగ్గా పెట్టలేక పోతున్నాడు. పచ్చగడ్డి కొనలేక ఎండుగడ్డి వేసేవాడు. పచ్చగడ్డికి అలవాటుపడ్డ గుర్రం ఎండుగడ్డి తినలేకపోయేది. తినలేకపోవడం ఏమిటీ–మస్తాన్ లాగే అదీ దర్జాగా బతికింది కావడంతో, అసలు ముట్టుకునేదేగాదు ఎండుగడ్డి.

గుర్రం చిక్కిపోవడంతో మస్తాన్‌కి బెంగపుట్టింది. గుర్రాని కేదేనా అయితే తన బతుకెలాగో తోచలే దతనికి. బాగా ఆలోచించాడు ఓ చక్కని వుపాయం తోచింది. దానిచేత ఎండుగడ్డయినా ఎలాగోలా తినిపిస్తే అంతగా చిక్కిపోదనుకున్నాడు.

ఓనాడు తీర్థానికి వెళ్ళి – ఆకుపచ్చరంగు కళ్ళజోడు కొనుక్కొచ్చాడు మస్తాన్. గుర్రం కళ్ళకి తగిలించాడు.

గుర్రం ముందు ఎండుగడ్డి వేసాడు.

గుర్రానికది పచ్చగడ్డిలా అగుపించింది. ఆప్యాయంగా తినడం మొదలెట్టింది. ఆ రకంగా మస్తాన్ తనచేయిదాటి పోతుందనుకున్న గుర్రాన్ని తన గుర్రం చేసుకున్నాడు – తాను బతకడం కోసం, అని ఓ గ్లాసుడు మంచినీళ్లు తాగి మళ్ళీ మొదలుపెట్టాడు కనకరాజు.

"యింతకీ నే చెప్పేదేమిటీ అంటే – ఇందాక మీ కళ్ళముందు నుంచి వెళ్ళిన ఆ బ్రహ్మాండమైన ఊరేగింపు ఆ ఆకు పచ్చరంగు కళ్ళ జోడులాంటిది – ఆ కళ్ళజోడు కళ్ళకి తగిలించుకొని మోసపోకండని మనవి చేసుకుంటున్నాను. దయచేసి నిజాన్ని చూడ్డానికి మంచికళ్ళ జోడు కొనుక్కోండి" అని ఉపన్యాసం ముగించాడు కనకరాజు.

"కనకరాజు ఏం చెప్పాడురా మీటింగులో" అన్నాడు ఓ పెద్ద మనిషి పక్కవాడితో.

"మంచి కళ్ళజోళ్ళు కొనుక్కోమన్నాడు అందర్నీ" అన్నాడు పక్కవాడు ఆ పెద్దమనిషితో.

★ ★ ★